సాక్షి కరీంనగర్

ఆదివారం | 1 | జూన్ | 2025



సెలవులో బల్దియా కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు వ్యక్తిగత సెలవులపై వెళ్లనున్నారు. ఆమెస్థానంలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారనేది తెలియాల్సిఉంది.



రాజన్న దారిలో..

వేములవాడ: రాజన్నను శనివారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.39 లక్షల ఆదాయం సమకూరింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.0/26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బహిరంగ ధూమపానం నేరం



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

కొత్తపల్లి: బహిరంగంగా పొగతాగడం నేరమని, చట్టప్రకారం జరిమానా విధించే అవకాశం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ తెలిపారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం కూడా నేరమని హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సీతారాంపుర్‌లోని జిల్లా సెంట్రింగ్ ఓనర్స్ సొసైటీ భవనంలో శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. పొగాకు వాడకం వల్ల కేన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని వివరించారు. పొగాకు వాడకాన్ని నిర్మూలించాలని కోరుతూ కార్మికులతో జడ్జి ప్రతిజ్ఞ చేయించారు. లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, జేఏసీ అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్, నారాయణ, మీస రాజయ్య పాల్గొన్నారు.

స్మోకింగ్ బానిసత్వం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

కరీంనగర్‌టౌన్: ధూమపానం అలవాటు కాదని, అది మన ఆరోగ్యాన్ని నాశనం చేసే మానసిక, శారీరక బానిసత్వం అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సిగరేట్, గుట్కా, బీడీ వంటి పదార్థాల్లో నికోటిన్ వంటి విషపదార్థాలు ఉంటాయన్నారు. ఇవి ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తాయని తెలిపారు. వైద్యులు సాజిదా, ఉమాశ్రీ, సన జవేరియా, విప్లవశ్రీ, రాజగోపాల్, స్వామి, కైక, పోచయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీఈవో మొండయ్య

కొత్తపల్లి(కరీంనగర్): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యాధికారి శ్రీరాంమొండయ్య తెలిపారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్‌లో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నెలరోజులుగా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అన్ని రకాలుగా వసతులు కల్పిస్తూ శిక్షణ విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. శిక్షణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, భగవంతరావు, అంజనేయులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 7నుంచి 8,30 గంటల వరకు 11 కె.వీ.జ్యోతినగర్, క్రిస్టియన్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని కోర్టు వెనక భాగం, మోర్ సూపర్‌మార్కెట్, పాత డీఐజీ బంగ్లా, క్రిష్టియన్‌కాలనీ, సవరన్‌స్ట్రీట్, శ్రీలత హాస్పిటల్, చర్చి ప్రాంతాలు, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 11 కె.వీ.రాంనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, పారమిత హెరిటేజ్‌స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్1, 2 ఏడీఈలు పి.శ్రీనివాస్‌గౌడ్, ఎం.లావణ్య తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కె.వీ.నేచర్ క్యూర్, ఎఫ్ఎం ఫీడర్ల పరిధిలోని రజ్వీచమన్, సిటిజన్‌కాలనీ, ప్రియదర్శినికాలనీ, క్రిష్ణనగర్, ఆటోనగర్, ధర్మనగర్, బొమ్మకల్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ జి.రఘు పేర్కొన్నారు.

బాల పురస్కార్‌కు ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2025–26 ఏడాదిలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డ్స్ కోసం అర్హులైన 5నుంచి 18ఏళ్ల బాలబాలికల నుంచి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ఎం సరస్వతి తెలిపారు. ఆవిష్కరణ, సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక, కళలు, సాహసం, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభ చూపినవారు అర్హులన్నారు. జూలై 31 లోపు దరఖాసు చేసుకోవాలని, వివరాలకు 94908 81098 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అమ్మకు భారమైతే.. ఊయల ఆదరిస్తుంది

- దత్తతకు చిరునామా శిశువిహార్ • చేరదీస్తారు.. చేతికందిస్తారు
- ఇప్పటి వరకు 96 మంది చిన్నారుల దత్తత
- ప్రస్తుతం శిశుగృహాలో ఉన్న పిల్లలు ఏడుగురు

94908 81098 నంబర్‌కు సమాచారం ఇస్తే శిశువును గోప్యంగా స్వీకరిస్తారు

సాక్షి Special Story

పొత్తిళ్లలో భద్రంగా దాచుకోవాల్సిన బిడ్డను కన్నతల్లి వద్దనుకుంటోంది.. వేలు పట్టుకుని నడిపించాల్సిన తండ్రి నాకెందుకీ భారమనుకుంటున్నాడు.. ఫలితంగా పసికందులు చెత్తకుప్పలు, నడి వీధుల్లో ప్రత్యక్షమవుతున్నారు. ఆడపిల్ల పుట్టిందనో, పసికందు అనారోగ్యంతో ఉందనో, కాళ్లు వంకరగా, గ్రహణ మొర్రి, బలహీనంగా ఉన్నారనో, ఆర్థికభారం.. కారణమేదైనా కొందరు ముక్కుపచ్చలారని పసిబిడ్డలను నడివీధుల్లో విసిరేస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువులను ప్లాస్టిక్ కవర్లో చుట్టి నడిరోడ్డుపై వదిలేసిన ఘటనలు తీవ్రంగా కలచివేస్తున్నాయి. అలాంటివారిని మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేరదీసి, పెంచి పెద్ద చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన దంపతులకు దత్తత ఇస్తున్నారు. తల్లిదండ్రులు వద్దనుకున్న పిల్లలను ఊయల పేరిట అక్కున చేర్చుకుంటుంది కరీంనగర్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రం. సంతానం లేని దంపతులకు దత్తత ఇచ్చి వారి కలను సాకారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దత్తత ఎలా ఇస్తారు.. పిల్లల చేరదీత.. తదితర వివరాలతో సాక్షి స్పెషల్.. – కరీంనగర్



- 8లో

కరీంనగర్ మాతా-శిశు కేంద్రంలో ఊయల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి(ఫైల్)

పుట్టిన శిశువు వద్దనుకునేవారు..

పుట్టిన శిశువు వద్దనుకునే తల్లిదండ్రులు మాతా శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఊయలలో వదిలివెళ్లాలి. శిశువును వదిలేసిన వారి సమాచారం, వివరాలు సేకరించబడవు. ఆ శిశువులు ప్రభుత్వ సంరక్షణలో ఉంటారు. వారిని నిబంధనల మేరకు దత్తత ఇస్తారు. నేరుగా అప్పగించాలనుకునేవారు హెల్ప్ డెస్క్ వాట్సాప్ 94908 81098 నంబర్‌కు సమాచారం ఇస్తే శిశువును గోప్యంగా స్వీకరిస్తారు.

మా పేరుందో..లేదో!

సర్వత్రా ఉత్కంఠ

- ప్రభుత్వ పథకాలపై ఆశలు
- రాజీవ్ యువవికాసం, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా సిద్ధం
- ఫైనల్ చేసిన ఎమ్మెల్యేలు
- జూన్ 2న లబ్ధిదారుల ఎంపిక



సిరిసిల్లలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటున్న పేదలు (ఫైల్)

'అన్నా.. జర యాది మరవకు.. మనకో ఇళ్లు వచ్చేలా చూడు. రాజీవ్ యువవికాసంలో దరఖాస్తు చేసిన.. జరచూడరాదె'.. అంటూ గ్రామాలు, పట్టణాల్లో కాంగ్రెస్ నాయకుల ఇళ్లన్నీ ఆశావహులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం జూన్ 2న ఇచ్చే పథకాల పైనే ఆశలు పెట్టుకున్న దరఖాస్తుదారులు కాంగ్రెస్ లీడర్ల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో చోటా నేతలు సైతం అదితూచి తమ వారి కోసం పట్టుపడుతున్నారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే ముచ్చట..

రాజీవ్ యువ వికాసం పథకం వివరాలు

జిల్లా	దరఖాస్తులు	కేటాయించిన యూనిట్లు
పెద్దపల్లి	47,470	15,496
కరీంనగర్	30,105	8,702
సిరిసిల్ల	7,680	7,121
జగిత్యాల	48,504	12,905

ఇందిరమ్మ ఇళ్ల పథకం (పైలట్ గ్రామాలు)

జిల్లా	దరఖాస్తులు	కేటాయించిన ఇళ్లు	ముగ్గుపోసినవి
పెద్దపల్లి	1,85,404	1,957	702
కరీంనగర్	2,14,225	2,027	961
సిరిసిల్ల	1,07,398	1023	518
జగిత్యాల	2,02,511	1,420	332

సాక్షి, పెద్దపల్లి:

ప్రభుత్వం అమలుచేస్తున్న రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఆశావహులు పెద్దసంఖ్యలో ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలనతో పాటు రాజీవ్‌యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు రాష్ట్ర సర్కారు అవకాశం ఇచ్చింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పూర్తయి.. అర్హుల జాబితా సిద్ధమైంది. బ్యాంకర్ల నుంచి జాబితా ఎమ్మెల్యేలకు చేరటంతో తుదిజాబితాలో తమ పేరు ఉండేలా లబ్ధిదారులు పైరవీలు షురూ చేశారు. ఎమ్మెల్యేలు సైతం తమ అనుచరుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందజేయగా ఆమోదించినట్లు సమాచారం. దీంతో జాబితాలో తమపేరు ఉందో లేదోనని లబ్ధిదారులు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జనవరి 26న ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6,427 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 2,513 ఇళ్లకు ముగ్గు పోశారు. పునాది దశలో నిర్మాణాలు పూర్తయిన వారి బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమయ్యాయి. మరోపక్క నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు అర్హుల జాబితా సిద్ధం చేశారు. కొన్ని గ్రామాల్లో ముఖ్య నాయకుల ఆధిపత్యంతో తన అనుచరులు, మద్దతుదారులను జాబితాలో చేర్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యువ వికాసానికి 1,33,759 దరఖాస్తులు

రాజీవ్ యువవికాసం పథకానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,33,759 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల వారీగా ఉమ్మడి జిల్లాకు 44,224 యూనిట్లు కేటాయించింది. దరఖాస్తుదారుల సిబిల్‌స్కోర్, రుణబకాయిలు, గతంలో కార్పొరేషన్ ద్వారా లోన్ తీసుకున్నారా తదితర అంశాలను పరిశీలించిన అనంతరం బ్యాంకర్లు అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితా ఎమ్మెల్యే చెంతకు చేరింది. ఎమ్మెల్యేలు ఫైనల్ చేసిన జాబితాను జిల్లాకమిటీ ద్వారా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తెలిపారు. యూనిట్లలో ప్రధానంగా రూ.లక్ష లోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికే ప్రభుత్వం ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చింది. ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ అవతరణదినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు అందజేయనున్నారు. దరఖాస్తులు ఎక్కువ రావడం, యూనిట్లు తక్కువగా ఉండటంతో ఎవరికి రుణం దక్కుతుందో అనేది ఉత్కంఠగా మారింది.

విలీనం.. ఎవరి ఆధీనం?

- జనవరిలో బల్దియాలో విలీనమైన శివారు గ్రామాలు
- అక్కడి నిర్మాణ అనుమతులు ఇంకా పంచాయతీరాజ్ చేతిలోనే?
- కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్‌కు రాని నిర్మాణ అనుమతులు
- టీఎస్ బీపాస్‌లో మార్పుకాని లాగిన్
- నెలన్నర క్రితమే లాగిన్ మారిందంటున్నా.. మేలో అనుమతులు

కరీంనగర్ నగరపాలక సంస్థకు రూ.కోట్ల ఆదాయానికి గండి



గతనెల 10వ తేదీన బొమ్మకల్ గ్రామంలో పంచాయతీరాజ్ ఇచ్చిన అనుమతి పత్రం

సాక్షి ప్రతినిధి,కరీంనగర్:

సాక్షి పరిశీలన

కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో భవన నిర్మాణ అనుమతులు ఇంకా పంచాతీయరాజ్ ఆధీనంలోనే ఉన్నాయి. బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌రావుపేట, చింతకుంట, మల్లాపూర్-లక్ష్మీపూర్ గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం జనవరిలోనే గెజిట్ విడుదల చేసింది. ఆయా గ్రామ పంచాయతీల బాధ్యతలను కార్పొరేషన్ స్వాధీ నం చేసుకుంది. ఇందులో నిర్మాణ సంబంధిత రికార్డులు సైతం ఉన్నాయి. ఆ రికార్డులను బల్దియా టౌన్‌ప్లానింగ్ ఆధీనంలో ఉంచుకుంది. కానీ.. నేటికీ అనుమతుల విషయంలో పంచాయతీరాజ్ విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికా రులే నిర్ణయం తీసుకుని, మంజూరు చేస్తుండటం గమనార్హం.దీంతో పేరుకు ఈ గ్రామాలు బల్దియా పరిధిలో ఉన్నా పంచాయతీరాజ్ అనుమతులివ్వడం చర్చనీయాంశంగా మారింది. నెలన్నర క్రితమే తమ లాగిన్ బల్దియాకు వెళ్లిందని ఆయా గ్రామాల సిబ్బంది తెలుపుతుంటే.. మే నెలలో పలు ఇంటి అనుమతి పత్రాలు ఆన్‌లైన్‌లో దర్శనమివ్వడంతో లాగిన్ మారిందా? లేదా అన్న సందేహాలు తీవ్రమవుతున్నాయి.

నేపథ్యమేమిటి?

కరీంనగర్ నగరపాలక సంస్థలో బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చింతకుంట, మల్కాపూర్ గ్రామాలతోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీ విలీనం అయ్యాయి. ఆ సమయంలో గ్రామ పంచాయతీల రికార్డులను బల్దియా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విలీనం జరిగి నాలుగు నెలలు కావస్తోంది. ఆయా గ్రామాల్లోని ఇంజినీరింగ్ సంబంధించిన పనులను బల్దియా ఇంజినీరింగ్ విభాగం తీసుకుంది. శానిటేషన్ రికార్డులను పారిశుధ్యవిభాగం చేపట్టింది. వాణిజ్య, గృహ నిర్మాణాలకు సంబంధించిన బాధ్యతలు టౌన్‌ప్లానింగ్ విభాగానికి ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటికీ టౌన్‌ప్లానింగ్ వారు భవన నిర్మాణ అనుమతులు జారీ చేయలేకపోతున్నారు. టీఎస్ బీపాస్ పరిధిలో ఉన్న విలీన గ్రామాల డేటా ఇప్పటికీ పంచాయతీ రాజ్ (ఇంజనీరింగ్)తో ముడిపడి ఉంది. గతంలో ఆయా విలీన గ్రామాల్లో వాణిజ్యం, గృహ నిర్మాణాల అనుమతులను టీఎస్ బీపాస్‌కు దరఖాస్తు చేసుకుంటే.. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం వారు వచ్చి పరిశీలించి అనుమతులు ఇచ్చేవారు. విలీనం జరిగి నాలుగు నెలలు కావొస్తున్నా.. నేటికీ ఆయా గ్రామాల్లో ఏదైనా నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వస్తే గ్రామ పంచాయతీ డిజిటల్ సంతకంతో కూడిన అనుమతులు వస్తున్నాయి. ఎందుకంటే ఆయా గ్రామాల లాగిన్లు ఇప్పటికీ టీఎస్ బీపాస్ నుంచి పంచాయతీరా జ్‌కు అనుసంధానమై ఉన్నాయి. వీటిని విలీనం తరువాత వెంటనే కరీంనగర్ కార్పొరేషన్‌కు బది లీ చేసినప్పటికీ.. టీజీ బీపాస్ వెబ్‌సైట్లో ఆ మేరకు లాగిన్ మార్పులు చేయకపోవడంతో నేటి కీ.. నిర్మాణ సంబంధ దరఖాస్తులను పంచాయతీరాజ్ విభాగం వారే అనుమతిస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో అనుమతి ఫీజు కాస్త రూ.వేలలోకి మారి బల్దియా ఆదాయానికి గండిపడుతోంది.

ఇవీ.. నష్టాలు

ఈ ప్రక్రియ వల్ల రూ.కోట్లాది బల్దియా ఆదాయానికి గండిపడటమే కాకుండా.. బహుళ అంతస్తుల నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాలు, అక్రమనిర్మాణాలను ప్రోత్సహించినట్లు అవుతోంది. బహుళ అంతస్తుల విషయంలో బల్దియాకు ఎలాంటి ఆస్తులు మార్టిగేజ్ చేయకుండా తప్పించుకున్నవారవుతారు. పంచాయతీరాజ్ వారు అనుమతులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. నిర్ణీత కాలవ్యవధిలో అనుమతులు ఇవ్వకపోవడంతో వల్ల సిటీజన్ చార్టర్ నిబంధనలు ఉల్లంఘనకు గురవుతున్నాయి. దీన్ని అడ్డం పెట్టుకుని పలువురు అక్రమ భవనాలకు అప్పుడే శ్రీకారం చుట్టారు. ఇది విస్తరిస్తున్న నగరాభివృద్ధికి, పౌరుల భద్రతకు ఆటంకంగా మారనుంది. ఈ విషయమైన పంచాయతీరాజ్ ఏఈ సుమన్‌ను వివరణ కోరగా.. నెలన్నర క్రితమే లాగిన్‌లు బల్దియాకు వెళ్లిపోయాయని సమాధానం చెప్పగా.. బల్దియా టౌన్‌ప్లానింగ్ వారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కేంద్రం నిధులతోనే నగర అభివృద్ధి



డ్రిల్లింగ్ మెషిన్ అందజేస్తున్న మంత్రి బండి సంజయ్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

- ఎంపీ ల్యాడ్స్‌తో నిరుపేదలకు న్యాయం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నగరాభివృద్ధి సాధ్యపడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. గతంలో నగరంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు శనివారం నగరపాలకసంస్థ కార్యాలయంలో డ్రిల్లింగ్ మెషిన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత్‌నగర్‌లోని వడ్డెర బస్తీలో జరిగిన అగ్ని ప్రమాదంలో 13 గుడిసెలు కాలిపోయాయని, ఆ సమయంలో బాధితులను ఆదుకుంటానని హామీ ఇచ్చానన్నారు. ఈ మేరకు వడ్డెరల కులవృత్తికి ఉపయోగపడే డ్రిల్లింగ్ మెషిన్లు ఎంపీ ల్యాడ్స్ నుంచి అందించినట్లు తెలిపారు. స్మార్ట్‌సిటీ, అమృత్ తదితర పథకాల ద్వారాకేంద్రం ఇచ్చిన నిధులతోనే నగరం అభివృద్ధి చెందిందన్నారు. శాతవాహయన యూనివర్సిటీలో లా కళాశాల ప్రారంభం కోసం ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ అనుమతులు తీసుకొచ్చామన్నారు. రూ.5కోట్లతో వేములవాడ, హుస్నాబాద్, జమ్మికుంట, హుజూరాబాద్ హాస్పిటల్స్ ఆధునీకరిస్తున్నామన్నారు.

అక్కడ ఆ చాంబర్ ఉండే

– గత స్మృతులు నెమరేసుకొన్న కేంద్ర మంత్రి

'మేడం అక్కడ మేయర్ చాంబర్ ఉండే. ఇక్కడ శానిటేషన్‌కు రూమ్ ఉండే'.. అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తాను కార్పొరేటర్‌గా ఉన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. కార్యాలయాన్ని ఆధునీకరించిన తరువాత మొదటిసారి రావడంతో పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌ను తనిఖీ చేశారు. నేరాలు జరిగిన తరువాత కాకుండా, జరగకుండా చూసేందుకు కమాండ్ కంట్రోల్‌లో 24/7 పోలీసులు ఉండేలా చూడాలని సూచించారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌ను చూసి బాగుందన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మేయర్లు యాదగిరి సునీల్‌రావు, డి.శంకర్, బీజేపీ నాయకులు బోయినిపల్లి ప్రవీణ్‌రావు, వాసాల రమేశ్, చొప్పరి జయశ్రీ, సోమిడి వేణు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- వన మహోత్సవాన్ని జయప్రదం చేయండి
- పక్కాగా రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లు
- సమీక్షలో కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. నీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించి క్లోరినేషన్ చేయాలని అన్నారు. జిల్లాలో అనువైన అన్ని ప్రదేశాల్లో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల మొదటి వారం నుంచి జిల్లాలో మొక్కల పెంపకానికి అనువైన స్థలాలను గుర్తించాలని అన్నారు. ఈ నెల 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల ను వివరించే వివిధ శాఖల శకటాలు, స్టాళ్ల ప్రదర్శన చేయాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చిన ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంతో పాటు వైద్య బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డీఎఫ్‌వో బాలమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు మార్చాలి

కరీంనగర్: అద్దె భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఈనెల 10లోగా ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్‌లోని సుడా కార్యాలయంలో శనివారం మహిళా శిశు సంక్షేమశాఖతోపాటు వివిధశాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 10వ తేదీలోగా ఖాళీగా ఉండి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలన్నారు. పాఠశాలల్లోకి అంగన్వాడీలను మార్చిన తర్వాత అక్కడ ఏవైనా వసతులు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, పంచాయతీరాజ్ ఈఈ రెహ్మాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


సత్యనారాయణ (ఫైల్)

రామగుండం: అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెద్దంపేట వద్ద చోటు చేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటవ డివిజన్ పరిధిలోని పాములపేట గ్రామానికి చెందిన గన్న సత్యనారాయణ(41) శుక్రవారం అర్ధరాత్రి అనారోగ్య కారణాలతో పెద్దంపేట-మంచిర్యాల రైల్వేస్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న కుమార్తెలున్నారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

చెరువులో దూకి వ్యక్తి..

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఘటన
- మృతుడు ఆదిలాబాద్ జిల్లా దంతనపల్లి వాసి


మహేశ్(ఫైల్)

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఊరి చెరువులో శనివారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన గోనె మహేశ్ (36)గా గుర్తించారు. మహేశ్ తిమ్మాపూర్‌కు చెందిన తుమ్మ లక్ష్మీనారాయణ అల్లుడు. మహేశ్‌కు భార్య మౌనిక, కుమారుడు చరణ్, కుమార్తె శిరీష ఉన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మహేశ్, అతని భార్య మౌనిక మధ్య కొన్ని రోజులుగా గొడవ జరుగుతున్నట్లు తెలిసింది. ఇటీవల తిమ్మాపూర్‌లోని పంచాయితీలు కూడా నిర్వహించినట్లు సమాచారం. ఈ వివాదాలే మహేశ్ ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి..

ధర్మపురి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాయపట్నం గ్రామంలో జరిగింది. ఎస్సై ఉదయ్‌కుమార్ వివరాలు.. రాయపట్నంకు చెందిన గొడిశెల సత్తయ్య (46)కు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. మెదడులో రక్తం గడ్డకట్టడంతో పక్షవాతం బారినపడ్డాడు. అప్పు చేసి వైద్యం చేయించుకున్నా పని చేయడానికి ఆరోగ్యం సహకరించడం లేదు. ఏ పని చేయక కటుంబ పోషణ, వైద్యానికి రూ.2లక్షల వరకు అప్పులు అయ్యాయి. అప్పు తీర్చలేనని బెంగతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్మకు భారమైతే.. ఊయల ఆదరిస్తుంది


దంపతులకు దత్తత పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

కరీంనగర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏటా పదుల సంఖ్యలో చిన్నారులను తల్లిదండ్రులు వదిలేస్తున్న ఘటనలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే కరీంనగర్‌లోని శిశువిహార్‌కు అప్పగించాలని, పోషకాహారం, వసతి సమకూర్చి విద్యను నేర్పిస్తూ కన్నబిడ్డలా కాపాడుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. పెళ్లీడు వచ్చినవారికి పెళ్లి పెద్దగా ఉండి వివాహం సైతం జరిపిస్తామంటున్నారు. ఇటీవల ఓ అమ్మాయికి కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి దగ్గరుండి పెళ్లి జరిపించడం విశేషం.

వద్దనుకునే వారికి ఊయల

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ గతంలో ఊయల పథకాన్ని తీసుకువచ్చింది. కరీంనగర్‌లోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో కలెక్టర్ పమేలా సత్పతి ఊయల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ పథకం గురించి మొదట్లో చాలా మందికి అవగాహన లేక పోగా, కలెక్టర్ విస్తృత ప్రచారం నిర్వహించేలా చొరవతీసుకున్నారు. తల్లిదండ్రులెవరైనా తమ బిడ్డలను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే ఆయా జిల్లాల్లోని శిశు గృహాలను సంప్రదించవచ్చు. తల్లిదండ్రులతో అధికారులు మాట్లాడి చిన్నారులను వదులుకోవడానికి గల కారణాలు తెలుసుకుంటారు. అవసరమైతే కౌన్సెలింగ్ ఇస్తారు. అప్పటికీ వారిలో మార్పు రాకుంటే సంరక్షణ బాధ్యత తీసుకుంటారు. కొన్నినెలల తర్వాత మళ్లీ పిలిచి చిన్నారిని తీసుకుంటారా, లేదా అని ఆరా తీస్తారు. అప్పటికీ అంగీకరించకుంటే చిన్నారి పూర్తి సంరక్షణ బాధ్యతను శిశువిహార్ అధికారులు తీసుకుంటారు. తర్వాత దత్తతకు అర్హులైన పిల్లలుగా గుర్తిస్తారు. ఇలా ఏటా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శిశువిహార్‌కు పదుల సంఖ్యలో చిన్నారులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిశువిహార్‌లో ఉండి ఉన్నత చదువులు అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించిన వారు ఎందరో ఉన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులను ఎవరైనా దత్తత తీసుకునేందుకు ముందుకొస్తే నిబంధనల ప్రకారం ఆర్థిక నేపథ్యం సహా అన్ని వివరాలు పరిశీలించి అప్పగిస్తున్నారు.

దత్తత కోసం విదేశాల నుంచి..

ఏటా పిల్లలను దత్తత తీసుకునేందుకు మన ప్రాంతానికి చెందిన వారే కాకుండా విదేశాల నుంచి దరఖాస్తు చేసుకుంటున్నారు. తెలంగాణకు చెందిన పలువురు దంపతులు 77 మందిని, ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు, తమిళనాడు, కర్ణాటకలో ముగ్గురు చొప్పున, మహారాష్ట్రలో ఇద్దరు, ఒడిశా, న్యూ ఢిల్లీలో ఒక్కరు చొప్పున దత్తత తీసుకున్నారు. అలాగే ఇటలీ దేశం వారు ముగ్గురిని, అమెరికా, సింగాపూర్ వారు ఒక్కరు చొప్పున దత్తత తీసుకోవడం విశేషం.

2011 నుంచి 2025 వరకు..

2011 నుంచి 2025 వరకు పలువురు దంపతులు 96 మంది పిల్లలను దత్తత తీసుకున్నారు. 2011లో ఏడుగురు, 2012లో ఒక్కరు, 2013లో 9 మంది, 2014లో ఇద్దరు, 2015లో 11 మంది, 2016లో ఏడుగురు, 2017లో ఒక్కరు, 2018లో ఐదుగురు, 2019లో ఐదుగురు, 2020లో ఏడుగురు, 2021లో ముగ్గురు, 2022లో 10 మంది, 2023లో 9 మంది, 2024లో 17 మంది, 2025లో ఇప్పటి వరకు ఇద్దరిని దత్తత తీసుకున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఇలా..

పిల్లలు లేని దంపతులకు మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశుగృహలో దత్తత కార్యక్రమం నిర్వహిస్తారు. సీఏఆర్ నిబంధనల ప్రకారం పాన్, ఆధార్, వయస్సు, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలు, మెడికల్ సర్టిఫికెట్లు, దంపతుల ఫొటో, సింగిల్ పేరెంట్ అయితే విడాకుల డిక్రీ/మరణ ధ్రువపత్రం, ఇద్దరు వ్యక్తుల సిఫార్సు లేఖలు ఉన్న పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. డాక్యుమెంట్లు అప్‌లోడ్ అయిన తర్వాత 3 సెట్ల కాపీలు, రూ.6వేలు డీడీని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలి. సీనియారిటీ, అర్హత ప్రకారం కోర్టు ఉత్తర్వులు, బర్త్ సర్టిఫికెట్‌తో పిల్లలను దత్తత ఇస్తారు.

చట్టపరంగా దత్తత తీసుకోవాలి

చట్టప్రకారం దత్తత తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ఆసక్తి ఉన్న దంపతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. పుట్టిన శిశువు వద్దనుకునే తల్లిదండ్రులు మాతా శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఊయలలో వదిలి వెళ్లాలి.

– సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి, కరీంనగర్

తూనికల తనిఖీలు చేసేదెలా..!

- కార్యాలయాలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- అధికారులకు అదనపు బాధ్యతలు
- 20 ఏళ్లుగా కొత్త పోస్టుల మంజూరే లేదు


పెద్దపల్లిలోని తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

పెద్దపల్లిరూరల్: వినియోగదారులను మోసం చేసే వ్యాపారుల భరతం పట్టే తూనికలు, కొలతల శాఖలో 20 ఏళ్లకాలంగా కొత్త పోస్టుల మంజూరు లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులకే రెండేసి, మూడేసి జిల్లాల్లో గల కార్యాలయాల్లో అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్‌లో గల కార్యాలయాల అధికారులకు సైతం అదనపు భాధ్యతల బరువు తప్పలేదు. ఇక్కడకు, అక్కడకు తిరగాల్సి వస్తుండడంతో పనులపై ఏకాగ్రత, తనిఖీలు నిర్వహించే సమయం లేక ఎవరైనా ఫిర్యాదులు చేస్తేనే స్పందించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాదాపు 20 ఏళ్ల క్రితం నుంచి తూనికలు, కొలతల శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఖాళీ అవుతున్నా కనీస భర్తీలు కూడా లేకపోవడంతో విధులు నిర్వర్తించడం కష్టంగా మారుతోందనే ఆందోళన కార్యాలయ వర్గాల్లో వ్యక్తమౌతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటి అవసరాలకనుగుణంగా కనీసం తాత్కాలిక పద్ధతినైనా సిబ్బందిని నియమించేలా చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

పెద్దపల్లి జిల్లా..

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గల తూనికలు కొలతల కార్యాలయాన్ని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితోనే జిల్లా బాధ్యతలు వెల్లదీస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడి అధికారికి మంచిర్యాల జిల్లా బాధ్యత అదనంగా నిర్వర్తిస్తున్నారు. అధికారితో పాటు టెక్నికల్ అసిస్టెంట్, అటెండర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారులు టూర్‌వెళ్తే అటెండరే కార్యాలయంలో ఉండాల్సిన పరిస్థితి ఉంది.

కరీంనగర్ జిల్లా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న అధికారికి నిజామాబాద్ జిల్లా జోన్ అసిస్టెంట్ కంట్రోలర్‌గా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కరీంనగర్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఇన్‌స్పెక్టర్‌గా ఒకరు పనిచేస్తుండగా.. మరో పోస్టు ఖాళీగా ఉంది. టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు అటెండర్లతో కార్యాలయాల విధులు వెల్లదీస్తున్నారు.

సిరిసిల్ల జిల్లా..

సిరిసిల్ల జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారికి కరీంనగర్ జిల్లా కార్యాలయ నిర్వహణ అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో సిరిసిల్ల, కరీంనగర్‌లలో విధులు నిర్వర్తించేందుకు రాకపోకలకే సమయం వృథాగా పోతోంది. ఈ కార్యాలయంలో ఓ టెక్నికల్ అసిస్టెంట్, ఓ అటెండర్ విధులు నిర్వర్తిస్తున్నారు.

జగిత్యాల జిల్లా..

జగిత్యాల జిల్లా తూనికలు, కొలతల శాఖ ఆఫీసులో పనిచేసే అధికారికి వరంగల్ జిల్లా బాధ్యతలు అప్పగించారు. అక్కడి (వరంగల్)కార్యాలయంలో ఒకే ఒక్కడుగా ఈ అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఆఫీసులో టెక్నికల్ అసిస్టెంట్, అటెండర్లతో ఆఫీసు పనిచేస్తోంది.

పార్థివదేహాలు ఇచ్చేందుకు ఇద్దరి అంగీకారం


అభినందన పత్రాలు అందజేస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన సింగరేణి రిటైర్డ్ మైనింగ్ సర్దార్ మంతెన రాజలింగయ్యతోపాటు సింగరేణి డిస్మిస్ కార్మికుడు నూకల గట్టయ్య ఇద్దరు ఆదర్శవంతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. తమ మరణాంతరం తమ శరీరాలను వైద్య విద్యార్థుల పరిశోధన కోసం మెడికల్ కాలేజీలకు దానం చేస్తామని స్వచ్ఛందంగా ప్రకటించారు. గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తాలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజలింగయ్య, గట్టయ్యలకు సీఐటీయూ ఆర్జీ-1 బ్రాంచ్ అధ్యక్షుడు ఆరెపల్లి రాజమౌళి చేతుల మీదుగా సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆరెపల్లి రాజమౌళి, సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, జాతీయ ప్రచార కార్యదర్శి కేఎస్. వాసు, మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు, అనుదీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శశికళ అభినందించారు. వైద్య విద్యార్థుల పరిశోధన కోసం తన దేహాలను దానం చేస్తాయడానికి ముందుకు రావడం స్ఫూర్తిదాయకమైన నిర్ణయమని కొనియాడారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామ శివారులో జగిత్యాల-ధర్మపురి రహదారిపై ఆటో బోల్తాపడి గందం రాజన్న(42) మృతిచెందాడు. బుగ్గారం మండలం వెలగొండ గ్రామానికి చెందిన రాజన్న కూరగాయలు కొనుగోలు చేసి, ఆటోలో తిరుగుతూ విక్రయిస్తాడు. శనివారం వేకువజామున 3గంటల సమయంలో జగిత్యాల మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా తక్కళ్లపల్లి శివారులో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో రాజన్నకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో


ఎల్లంపల్లి ప్రాజెక్టు


రామగుండం: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తుంది. నీటి పారుదలశాఖ అధికారులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.5 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1158 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, హైద్రాబాద్ మెట్రోకు 331 క్యూసెక్కులు, ఎన్టీపీసీ 121 క్యూసెక్కులు, మొత్తంగా 452 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. కాగా 2024 జూన్ 31వ తేదీ నుంచి 2025 మే 31 నాటికి (ఇరిగేషన్ ఇయర్) ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీకి 16.20 టీఎంసీలు, హైద్రాబాద్ మెట్రోకు 56.03 టీఎంసీలు, గూడెం ఎత్తిపోతలు 10.83 టీఎంసీలు, వేంనూర్ ఎత్తిపోతలు 5.09 టీఎంసీలు, నంది పంపుహౌజ్ ఎత్తిపోతలు 210 క్యూసెక్కులు, మిషన్ భగీరథ 14.06 టీఎంసీలు ఔట్‌ఫ్లో జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు.




సాగుకు వేళాయె..

రోహిణి కార్తె వచ్చిందంటే చాలు రైతన్న పొలం బాట పట్టి గంపెడాశలతో సాగుకు సన్నద్ధమవుతాడు. జోడెడ్లు, ట్రాక్టర్లతో దుక్కి దున్ని నారుమడులు సిద్ధం చేస్తారు. మరోవైపు పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేస్తారు. కాగా, కాస్త ముందే పలకరించిన వర్షాలతో సంతోషం వ్యక్తం చేస్తూ చెలకబాట పట్టిన రైతన్నలు విత్తనాలు వేశాక వరుణుడు మొహం చాటేస్తాడేమోనని సంకోచిస్తున్నారు. పెద్దపల్లి శివారులో దుక్కి దున్ని విత్తనాలకు సిద్ధమవుతున్న రైతులు 'సాక్షి' కెమెరాకు కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





వ్యవసాయ, అనుబంధ కోర్సులకు నోటిఫికేషన్

- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ జూన్ 28
- తెలంగాణ ఎఫ్‌సెట్(ఎంసెట్) ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు


పొలాసలోని వ్యవసాయ కళాశాల


డ్రిప్ టెక్నాలజీ గురించి తెలుసుకుంటున్న వ్యవసాయ విద్యార్థులు (ఫైల్)

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోని వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, హార్టికల్చర్, ఫుడ్ టెక్నాలజీ వంటి కోర్సుల్లో చేరేందుకు అవసరమైన నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శనివారం విడుదల చేసింది. బైపీసీ చదివి తెలంగాణ ఎఫ్‌సెట్-2025(మెడికల్ అండ్ అగ్రికల్చర్)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. వెటర్నరీ సైన్స్ కోర్సు వ్యవధి ఐదున్నర ఏళ్లు కాగా.. మిగతా కోర్సుల వ్యవధి నాలుగేళ్లు.

సీట్ల వివరాలు..

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లా పొలాస, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం, వరంగల్ అర్బన్ జిల్లా, సిరిసిల్ల-సిద్దిపేట మధ్యలో, ఆదిలాబాద్‌లో ఏడు అగ్రికల్చర్ కళాశాలలున్నాయి. ఇందులో 615 సీట్లున్నాయి. వీటికి అదనంగా 365 సెల్ఫ్ ఫైనాన్స్(పేమెంట్) సీట్లున్నాయి. బీఎస్సీ(వెటర్నరీ) కళాశాలలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, వరంగల్ అర్బన్ జిల్లా మమునూర్ ఉండగా.. అందులో 168 సీట్లున్నాయి. బీఎఫ్ఎస్సీ(ఫిషరీష్) కళాశాలలు వనపర్తి జిల్లా పెబ్బేరులో 25 సీట్లున్నాయి. బీఎస్సీ(హార్టికల్చర్) కళాశాలలు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, వనపర్తి జిల్లా మోజర్ల, మహబూబాబాద్ జిల్లా మల్యాలలో ఉండగా.. ఇందులో 200 సీట్లున్నాయి. వీటికి అదనంగా 54 పేమెంట్ సీట్లను కేటాయించారు. బీఎస్సీ(కమ్యూనిటీ సైన్స్) కళాశాల హైదరాబాద్‌లోని సైఫాబాద్‌లో ఉండగా.. 38 సీట్లున్నాయి. వీటికి అదనంగా 5 పేమెంట్ సీట్లున్నాయి. బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కళాశాల నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో ఉండగా.. 25 సీట్లున్నాయి. వీటికి అదనంగా 5 పేమెంట్ సీట్లున్నాయి. అన్ని కోర్సుల్లో పేమెంట్ సీట్లను సైతం తెలంగాణ ఎఫ్‌సెట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగానే భర్తీ చేస్తారు.

జూన్ 28 గడువు

ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజుగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.3,000, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. కౌన్సిలింగ్‌లో సీటు వస్తే వ్యవసాయ, కమ్యూనిటీ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు రూ.49,560, వెటర్నరీ కోర్సులకు రూ.69,400, ఫిషరీస్ కోర్సులకు రూ.52,770, హార్టికల్చర్ కోర్సులకు రూ.48,595 చెల్లించాల్సి ఉంటుంది. అగ్రికల్చర్ కోర్సుల్లో పేమెంట్ సీట్లకు రూ.5లక్షలు, హార్టికల్చర్ కోర్సులో పేమెంట్ సీట్లకు రూ.5లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. పేమెంట్ సీట్లకు సంబంధించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. తెలంగాణ ఎంసెట్-2025 ర్యాంకుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు జూన్ 27 ఆఖరు తేదీ కాగా.. ఆన్‌లైన్ దరఖాస్తులు పంపేందుకు జూన్ 28 ఆఖరు తేదీ.

రైతులు, రైతు కూలీల పిల్లలకు రిజర్వేషన్లు

బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో రైతు బిడ్డలకు 25 శాతం, రైతు కూలీల పిల్లలకు 15 శాతం సీట్లు రిజర్వ్ చేశారు. బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 40 శాతం సీట్లు రిజర్వ్ చేశారు. రైతుల పిల్లలకు వెటర్నరీ కళాశాలలు, ఫిషరిస్ కళాశాలల్లో 25 శాతం సీట్లు, హార్టికల్చర్ కోర్సుల్లో 40 శాతం సీట్లు రిజర్వ్ చేయబడ్డాయి. అయితే కనీసం ఎకరం భూమి ఉన్న రైతులకు ఫార్మర్స్ కోటా వర్తిస్తుంది. సదరు భూమి విద్యార్థి పేరు మీద లేదా తల్లిదండ్రుల పేరు మీద, తాత అమ్మమ్మ పేరు మీద పట్టా ఉండాలి. రైతు కూలీల రిజర్వేషన్ కోసం ఎంపీడీవోలు ఇచ్చే ఉపాధిహామీ ఈజీఎస్ కార్డు ఉండాలి. ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్లపాటు నాన్ మున్సిపల్ ఏరియా(గ్రామీణ ప్రాంతం)లో చదివి ఉండాలి. అడ్మిషన్ పొందే నాటికి జనరల్ అభ్యర్థులు వయస్సు 17 ఏళ్లు పూర్తయి 22 ఏళ్లు దాటి ఉండొద్దు. ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు, పీహెచ్‌లకు 27 ఏళ్ల వరకు అనుమతి ఉంటుంది. ఒక్క వెటర్నరీ కోర్సుకు మాత్రం జనరల్ అభ్యర్థులు 17-25 ఏళ్ల మధ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు 30 ఏళ్ల వరకు ఉండొచ్చు. మరిన్ని పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీజేటీఏయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

స్పోర్ట్స్ హాస్టల్, అకాడమీల్లో ప్రవేశాలు

- నేటి నుంచి ఈనెల 13వరకు ఎంపికలు



కరీంనగర్‌స్పోర్ట్స్: స్పోర్ట్స్ హాస్టల్, అకాడమీలు ఔత్సాహిక క్రీడాకారులకు వరంలా మారుతున్నాయి. ప్రపంచస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారుల్లో చాలా మంది స్పోర్ట్స్ హాస్టల్, అకాడమీల నుంచే వచ్చిన వారే కావడం విశేషం. ఏటా రాష్ట్రంలోని స్పోర్ట్స్ అకాడమీలు, హాస్టళ్లలో ప్రవేశాలకు బాల, బాలికలకు ఎంపిక పోటీలను రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ నిర్వహిస్తోంది. 2025-26 సంవత్సరానికి నేటి నుంచి ఈ నెల 13వరకు తెలంగాణవ్యాప్తంగా ఉన్న హాస్టళ్లు, అకాడమీల ఎంపికను నిర్వహించనున్నారు.


హాస్టల్, అకాడమీల వివరాలు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ క్రీడా అకాడమీలు, వసతి గృహాల్లో 2025-26 ఏడాది ప్రవేశానికిగానూ అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్, రెజ్లింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాల్లో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించనున్నారు. కళాశాల లేదా పాఠశాల ప్రస్తుత విద్యాసర్టిఫికెట్, జనన, క్రీడా ధ్రువీకరణపత్రాలు, ఆధార్‌కార్డు, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎంపికలకు హాజరుకావాలి. 12 నుంచి 16 ఏళ్లలోపు వయసు ఉండాలి. జాతీయస్థాయి సబ్ జూనియర్స్, ఎస్జీఎఫ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపిక పోటీల తేదీలు..

ఆదివారం వాలీబాల్ అకాడమీ (సిద్దిపేట), ఈ నెల 10, 11న హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్‌లో సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ ఎంపిక ఉంటుంది. 10, 11న హన్మకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో, 10న హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీ, రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీ ఎంపికలు మినీ స్టేడియంలో ఉంటాయి. 12న హాకీ అకాడమీ (వనపర్తి)ఎంపికలు వనపర్తిలోని డాక్టర్ బాలకిష్టయ్య మినీ స్టేడియంలో ఉంటాయి. 12న అథ్లెటిక్స్ అకాడమీ (ఖమ్మం) ఎంపికలు ఖమ్మం డీఎస్ఏలో, 12, 13న, వాలీబాల్ అకాడమీ (మహబూబ్‌నగర్) ఎంపికలు మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో ఉంటాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ



స్పోర్ట్స్ అకాడమీ, హాస్టళ్లలో ఉత్తమ కోచ్‌ల ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణనిస్తారు. క్రీడాకారులు వీటిలో ప్రవేశాలు పొందితే ఉన్నతంగా ఎదగడంతో పాటు దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తారు. క్రీడా అకాడమీ, స్పోర్ట్స్ హాస్టళ్లలో ప్రవేశ అవకాశాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– చల్లా హరిశంకర్, బేస్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మంచి అవకాశం



స్పోర్ట్స్ అకాడమీ, హాస్టళ్లలో శిక్షణనిస్తుండటం క్రీడాకారులకు మంచి అవకాశం. ఏటా రెజ్లింగ్ క్రీడ నుంచి సుమారు ఐదుగురు క్రీడాకారులు ఎంపికవుతున్నారు. రెజ్లింగ్ క్రీడాకారులందరు సద్వినియోగం చేసుకోవాలని. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడి శిక్షణ దొరుకుతుంది.

– ముస్త్యాల రవీందర్, వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, పెద్దపల్లి